క్లుప్తంగా

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీసీసీ నూతన అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. నర్మేటలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం డీఈఓ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిన దృఢత్వానికి దోహదపడుతాయన్నారు. గెలుపు ఓటమి సహజమని, ఓడిపోతే కృంగిపోకుండా ప్రతిభ మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్ఎం నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజమౌళి, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్‌లను రెగ్యులరైజ్ చేయండి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను వెంటనే కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జిల్లా జేఏసీ అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలపరిధిలోని పెద్దకోడూరు సబ్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను మోసం చేసిందన్నారు. ఆర్టిజన్ కన్వర్షన్ అయ్యే వరకు రిక్రూట్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో నిర్వహించే ధర్నాకు విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్, సతీశ్, రాంరెడ్డి, శ్రీధర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 33 కేవీ దూల్మిట్ట లైన్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ కరెంట్ ఉండదని తెలిపారు.

వ్యక్తికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దుద్దెడలో రాజీవ్ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మహేందర్ ద్విచక్ర వాహనంపై రోడ్డును దాటుతున్నాడు. హైదారాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో గాయాలైన మహేందర్‌ను టోల్ ప్లాజా అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాలా పునరుద్ధరణ.. పొన్నంకు థ్యాంక్స్

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కోహెడ పోచమ్మ కాలనీ, షాపింగ్ కాంప్లెక్స్ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల బాడుగుల చెర్వు వరద ప్రవాహంతో బంధం వద్ద ఉన్న నాలా గోడ కూలి కాలనీ వాసుల ఇళ్లలోకి నీరు చేరగా మంత్రి.. మాజీ సర్పంచ్ దొమ్మాట జగన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కాలువను పరిశీలించారు. గోడ కూలిన సిమెంటు పెంకులు కాలువలో నీరు పారకుండా అడ్డుపడటాన్ని గమనించారు. వెంటనే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. అతను మంగళవారం జేసీబీ ద్వారా కాలువను పునరుద్ధరించారు. కాలనీవాసులు పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



నాలా పనులను చేపడుతున్న జేసీబీ

- కోహెడ(హుస్నాబాద్):

తారురోడ్డు కోసం.. తండావాసుల వినతి

మండలంలోని పంతుల్‌తండా గ్రామ పరిధిలోని ఫిక్కుతండా, ధరావత్‌తండా, చెరువుకొమ్ముతండాలకు తారురోడ్డు నిర్మించాలని తండావాసులు, బీజేపీ గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు రైనానాయక్ కోరారు. మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తండాలకు తారురోడ్డు లేక రహదారి అంతా అధ్వానంగా మారిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా కోతకు గురైందన్నారు. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితిలో తండా రోడ్లు ఉన్నాయన్నారు.



మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ గిరిజన మోర్చా మండలాధ్యక్షుడు రైనా నాయక్

- అక్కన్నపేట(హుస్నాబాద్):

హడలెత్తిస్తున్న కుక్కలు

దుబ్బాక మున్సిపాలిటీలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తుతున్నాయి. వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. దీంతో పిల్లలను బయటకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. పశువుల సమూహాలపై కూడా ఇదే తరహాలో దాడులకు తెగబడుతున్నాయి. వాహనదారుల వెంట పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాకర్స్ కట్టెపట్టుకొని వాకింగ్‌కు వెళ్తున్న పరిస్థితి ఇక్కడుంది.



దుంపలపల్లిలో కుక్కల గుంపు

- జనం బెంబేలు
- శునకాల దాడిలో ఇటీవల వృద్ధురాలి మృతి
- పిల్లలపైనా దాడులు
- వాహనాల వెంటపడటంతో ప్రమాదాలబారిన వాహనాదారులు
- కట్టెలు పట్టుకొని వాకింగ్‌కు వాకర్స్

దుబ్బాక: పట్టణంలో 20 రోజుల క్రితం గుడిసెలో నిద్రిస్తున్న 90 ఏళ్ల వృద్ధురాలు అయ్యంగారి రంగమ్మపై అర్ధరాత్రి కుక్కల గుంపు దాడి చేసి శరీరాన్ని ఇష్టారీతిన పీక్కుతిన్నాయి. ఆమె అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి తరిమిగొట్టి ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ చనిపోయింది. చాలామంది చిన్నారులపై, ప్రజలపై వీటి దాడుల్లో తీవ్రగాయాలై ఆస్పత్రి పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. పశువుల కోష్టాలపై చేస్తున్న దాడుల్లో జీవాలు సైతం మృతి చెందుతున్నాయని రైతులు చెబుతున్నారు.

రోడ్లపై వెంబడిస్తూ..

పట్టణంలోని దుంపలపల్లి, చీకోడ్, హబ్షీపూర్ రోడ్లలో కుక్కల మందలు.. వాహనాలను వెంబడిస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పట్టణంలోని దుంపలపల్లి రోడ్డులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతంలో వాహనాలతో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలపై, ఆ ప్రాంతంలోని పశువులపై దాడులు చేస్తున్నాయి. మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లే ప్రజలు గుంపుగా కట్టెలు పట్టుకొని వెళ్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. పలు ప్రాంతాల్లో 265 కుక్కలను పట్టుకొని ప్రత్యేక వాహనంలో సిద్దిపేట పట్టణంలోని జంతు సంరక్షణ కేంద్రానికి తరలిస్తూ అక్కడ వైద్యులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. అయినప్పటికీ కుక్కల బెడదతో ఇబ్బందులు ఉన్నాయని నివారించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

కట్టెలు పట్టుకొని వాకింగ్..



దుంపలపల్లి రోడ్డులో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్తుంటే కుక్కల గుంపులు వెంబడిస్తూ దాడులు చేస్తున్నాయి. ఒకరిద్దరం వెళ్ల లేక గుంపుగా కలిసి కట్టెలు పట్టుకొని వెళ్తున్నాం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద 20–30 కుక్కలు ఎవరు వెళ్లినా మందగా వస్తు వెంబడిస్తూ దాడి చేస్తున్నాయి.

– సిరిమల్లె వేణుగోపాల్, దుబ్బాక

చర్యలు తీసుకుంటాం



దుబ్బాక మున్సిపాలిటీలో కుక్కల బెడద సమస్య తీవ్రతరమైంది. ఇప్పటికే ఇవి ఎక్కువగా ఉన్న ఏరియాలను గుర్తించాం. వీటి సంతానోత్పత్తి లేకుండా పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తప్పకుండా చర్యలు చేపడుతాం.

–రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: నమ్ముకున్న కులవృత్తిలో ఆదరణ కరువై ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పద్మశాలి సంఘం దుబ్బాక పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన జిందం గాలయ్య ఇంటికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంటయ్యతో కలిసి ఎమ్మెల్యే వెళ్లి నూతన కమిటీని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను గాలయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. చేనేత పరిశ్రమకు పుట్టినిల్లయిన దుబ్బాకలో ఉపాధి సరిగ్గా లేక చేనేత కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తగినవిధంగా ఉపాధి కల్పించి వారి కుటుంబాలు సంతోషంగా ఉండేలా కృషి చేస్తానన్నారు. పద్మశాలిల అభ్యున్నతికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



గాలయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రీజినల్ మేనేజర్ బాలనాగు

హుస్నాబాద్‌రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని దక్కన్ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్(ఆర్ఎం) బాలనాగు అన్నారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కట్కూర్ దక్కన్ గ్రామీణ బ్యాంకుల పరిధిలోని 32 మహిళా స్వశక్తి సంఘాలకు రూ.6 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా బాలనాగు మాట్లాడుతూ గ్రామీణ మహిళలు వంటింటికి పరిమితం కాకుండా స్వయం ఉపాధి పొందాలన్నారు. సమాజంలో మహిళలు ఆర్థిక శక్తిగా నిలబడి దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఇంటిని చక్కబెడుతున్న వారు వ్యాపారంలో రాణించడం పెద్ద సమస్యే కాదన్నారు. డెయిరీ ఫాంలను నెలకొల్పి లక్షల ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. కుటీర పరిశ్రమలతో పాటు నిత్యావసర సరుకుల ఏజెన్సీల సాయంతో వ్యాపారంలో రాణించవచ్చన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, బ్యాంక్ మేనేజర్లు గిరిమోజు నాయక్, కృష్ణ, రమేశ్, నెహ్రూ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల ప్రతినిధులకు చెక్కును అందిస్తున్న బాలనాగు

చౌరస్తాల వద్ద సదుపాయాలు కల్పిస్తాం

ఆర్టీసీ డీఎం సుఖేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): రహదారుల వెంట జనసమూహ ప్రధాన చౌరస్తాల వద్ద కనీస వసతులుండేలా చూస్తామంటూ సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేదంర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెలికట్ట శివారులో రాజీవ్ రహదారిపై జనగామకు వెళ్లే క్రాస్ రోడ్డుపక్కన మరుగుదొడ్డి, మూత్రశాలల నిర్మాణాల కోసం ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో కలిసి ఆయన మంగళవారం స్థల పరిశీలన చేశారు. రోడ్డుపక్కన దుకాణాలను అద్దెకిచ్చిన యజమాని వచ్చి వేరే చోట కట్టాలంటూ పేర్కొనగా, ప్రజలకు అవసరమైన చోట ప్రభుత్వ ఆధీన స్థలంలో నిర్మిస్తామంటూ కరాకండీగా చెప్పారు. రాజీవ్ రహదారిపై సిద్దిపేట నుంచి హైదారాబాద్, జనగామ తదితర పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద పెద్ద సంఖ్యలో వస్తుంటారన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. స్థల పరిశీలన విషయంతో పాటు నిర్మాణాలు జరిగే చోట ఎలాంటి అడ్డంకులు రాకుండా విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పథకం పేదల వరంలాంటిదని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. కొండపాకలో ఐదుగురు పేరిట మంజూరైన చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ పేదలు కార్పొరెట్ వైద్య చికిత్సలు పొందేందుకు సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమయానుకూలంగా బస్సులు నడపాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థుల సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపక పోవడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు ఇబ్బందికి గురవుతున్నారని మిరుదొడ్డి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని మంగళవారం తెలిపారు. ప్రతీరోజు సాయంత్రం 4.15 గంటలకు స్కూల్ ముగుస్తుందన్నారు. నిర్ణీత సమయం కంటే సాయంత్రం 4.10 గంటలకే ఆర్టీసీ బస్సులు వెళ్లిపోతున్నాయన్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని తమ ఇళ్లకు వెళ్లే విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి మిరుదొడ్డి మోడల్ స్కూల్ మీదుగా వెళ్లే బస్సులను విద్యార్థుల సమయానుగుణంగా నడపాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు మంగళవారం అన్నారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, జువాలజీ, టీజీటీ తెలుగు పోస్టులకు గంటల ప్రాతిపదికన బోధించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు పీజీ, బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం ఉదయం 10.30 గంటలకు పాఠశాలలో జరిగే డెమోకు సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 99667–58514 సంప్రదించాలని కోరారు.

పాడి రైతులు ఆందోళన చెందొద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పాడి రైతులు ఆందోళన చెందొద్దని విజయ డెయిరీ ద్వారా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను ప్రభుత్వం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటుందని పాలఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు మొగిలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీ పాల బిల్లులు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని విజయ డెయిరీ చైర్మన్ అమిత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డికి సైతం విన్నవించగా సానుకూలంగా స్పందించి తక్షణమే రూ. 50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయన ప్రత్యేక దృష్టి సారించారని, పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.



మొగిలి జనార్దన్‌రెడ్డి

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

చేర్యాల(సిద్దిపేట): వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరండి అని సీఐ ఎల్ శ్రీను అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట జాతీయ రహదారి మీద హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్న వాహనదారులను ప్రోత్సహించేలా ఆపిల్ పండ్లు అందజేసి అభినందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ హెల్మెట్ ప్రాణాన్ని రక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



చేర్యాల(సిద్దిపేట): హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారికి ఆపిల్ ఇస్తున్న సీఐ, ఎస్ఐ

ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కలిసి కృషి చేద్దామని, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో రోడ్డు నిబంధనలపై విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనాలను నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రహదారులపై ఉన్న సైన్ బోర్డులపై ఉన్న సూచికలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు గీతాదేవి, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు

దుబ్బాకటౌన్: యువత మద్యం, గంజాయి, ప్రేమ పేరుతో తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తొగుట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే లతీఫ్ అన్నారు. రాయపోల్ మండల పరిధిలోని ఎల్కల్‌లో ఆజాద్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పదో తరగతితో ప్రభుత్వ ఉద్యోగాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధచూపాలని, పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అమత్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, బీజేపీ ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి మంగిడి స్వామి, తదితరులు ఉన్నారు.

సేవా దృక్పథమే ఎన్ఎస్ఎస్ ఉద్దేశం

జిల్లావ్యాప్తంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రభుత్వ బాలుర, బాలిక ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. తొలుత విద్యార్థులు శ్రమదానం చేశారు. విద్యార్థులు విద్యతోపాటు సామాజిక సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఎంఈఓలు, ప్రిన్సిపాల్స్ అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు, కళాశాల ఉపాధ్యాయులు, పాఠశాల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: ఖోఖో విజేత బాలుర జట్టు



గజ్వేల్ రూరల్: మాట్లాడుతున్న సీఐ సైదా



సిద్దిపేట: సర్టిఫికెట్లు అందుకున్న వలంటీర్లు



కొండపాక: పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

హుస్నాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సతీశ్ తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలిపారు.

◆ వరి పొలాల పరిశీలన

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రస్తుతం ప్రతికూల వాతావరణ పరిస్థితుల వలన వరి పంటలో కొన్ని తెగుళ్లు గమనించడం జరిగిందని ఏఈఓ కరంటోతు శ్రీలత అన్నారు. అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలో వరి పొలాల సందర్శించారు. ఆ మేరకు రైతులకు సలహాలు, సూచనలను ఇచ్చారు. ప్రధానంగా అగ్గితెగుల వలన వరి పంట ఎక్కువ మోతాదులో నష్టపోతుందన్నారు.

◆ సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మద్దూరు(హుస్నాబాద్): వరి పంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లోని వరి పంటలను ఆయన పరిశీలించారు. ఏఈఓ రాజు పాల్గొన్నారు.

◆ హుండీ లెక్కింపు

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ హుండీ ఆదాయం 2 లక్షల 4 వేల 888 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ పీవీ శర్మ తెలిపారు. మంగళవారం గ్రేడ్ వన్ కార్యనిర్వహణ అధికారి రవికుమార్ పర్యవేక్షణలో స్థానిక పోలీస్, గ్రామ కార్యదర్శి సమక్షంలో ఏప్రిల్ 24 నుంచి ఇప్పటి వరకు వేసిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు.

◆ విద్యార్థి సమస్యలపై పోరాడుదాం

సిద్దిపేటజోన్: విద్యార్థుల సమస్యలపై సంఘటితంగా పోరాటం చేద్దామని బీఆరేస్వీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం విద్యార్థి కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని న్యూజనరేషన్, దీక్ష జూనియర్ కళాశాలల్లో బీఆరేస్వీ నూతన కమిటీలను నియమించారు.

◆ ఎయిడ్స్ నిర్మూలనపై సదస్సు

హుస్నాబాద్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం మీర్జాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధుల నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ తిరుపతి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సదాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్, బీజేఆర్ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి పది రోజుల క్రితం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇందులో 36 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరు పర్చగా జడ్జి.. రూ.43,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ చట్టాలపై అవగాహన

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని పెద్దరాజుపేట పోతిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం కొమురవెల్లి పోలీసుల ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ ఎల్.రాజు, సిబ్బంది, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్యేల ఇళ్లపై దాడి హేయం

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, జిల్లా నాయకుడు సూకూరి లింగంలు అన్నారు. మంగళవారం వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సునీతారెడ్డి ఇళ్లపై దాడి చేయడం సరికాదన్నారు.